కథా కౌముది



# సినిమా టికెట్

కమల్ మంజర్లపాటి

“మీ నాయన ఏం పని చేస్తాడు రా బక్కోడా? ” సైన్స్ చెప్పడానికి వచ్చిన నరసింహా రావు సర్ మధు గాడికి తొడపాశం పెడుతూ అడిగాడు.

ఇదే ప్రశ్న మధు ని అడిగితే వాడు సరిగా చెప్పలేదని తొడ పాశం పెడుతున్నాడు మా కొత్త సార్. ఇతనికి తొడ పిచ్చిలా ఉంది. భయంగా నా లాగును కిందకు గుంజి తొడలు దాచుకునే ప్రయత్నం చేసాను. చదివేది ఏడవ తరగతే కాబట్టి మాకు లాగులే. అవి కిందకి జారుతుంటే మేము పైకి లాగుడే!

“మంగలి షాపు ఉంది సర్. కటింగ్ చేస్తాడు” అన్నాడు బక్కోడైన ఓదెల ప్రసాద్ గాడు. వాడి ఇల్లు మంగలి గుట్ట మీదనే.

“ఎక్కడ రా షాపు?” మళ్ళీ అడిగాడు ఆయన.

“వినోద మహల్ దగ్గర సర్” వాడు చెప్పాడు.

వాడి సమాధానం సంతృప్తి గా అనిపించిందేమో! వాడిని వదిలేసాడు. వాడికి ఏ పాశము పెట్టలేదు. వాడికి ‘పాశం’ పెట్టే అంత కండ కూడా తొడకు లేదు. బక్క ప్రాణపోడు. వదిలేయడానికి అది కూడా కారణం కావొచ్చు.

“అరేయ్ మీ నాయన...?” నాగరాజుగాడిని అడిగాడు. వీడు ప్రసాద్ పక్కనే కూర్చుంటాడు.

ఆయన ఆ ప్రశ్న అంటుంటే నాగరాజుగాడి తొడ వైపు చూసాను. వీడికి పాశం ఖచ్చితం అనిపించింది. నాగరాజు తొడ కండ పట్టి ఉంటుంది. తల నిండా మెదడు కూడా ఉంటుంది. కానీ, దానికి చురుకు ఉండదు.

“వ్యవసాయం చేస్తాడు సర్” నాగరాజు గాడు జవాబిచ్చాడు.

“ఎక్కడ?”

“మా ఊర్లో సర్?”

“ఏ ఊరు రా ముండా?”

"మా ఊరు సర్?" వాడు తమాషాకి అలా సమాధానం ఇస్తున్నాడని కొత్త గా సైన్స్ క్లాస్ చెప్పడానికి వచ్చిన నర్సిమ్మా రావు సార్ అనుకుంటున్నాడు కానీ... "కాదు" అని నాకు తెలుసు. మొదటే చెప్పినట్టు జంపాల నాగరాజు గాడు అంత దిమాక్ ఉన్నోడు కాదు. వాడు మహా పిరికి నాకొడుకు. వాళ్ళ నాయన–అమ్మ ఖమ్మానికి దగ్గరలో ఉన్న "తోడేళ్ళ గూడెం" అనే ఊర్లో ఉండి వ్యవసాయం చేస్తూ, ఒక్కగానొక్క కొడుకు నాగరాజుని ఖమ్మంలో వాడి అమ్మమ్మ–తాత దగ్గర ఉంచి చదివిస్తున్నారు. తాత పేరు భలే చిత్రంగా ఉంటుంది. "మా తాత పేరు సముద్రం" అని వాడి నోటి వెంట విన్నప్పుడు "మనిషి కి ఇదేం పేరు?" అన్నట్టు మొహం పెట్టాను.

"అదేం పేర్రా? సముద్రం! నిజం గా అదే పేరా?" సందేహిస్తూ అడిగాను.

"సముద్రమేరా!" ప్రసాద్ గాడు సాక్ష్యానికి వచ్చాడు. ప్రసాద్ గాడికి ఎలా తెలుసంటే...? నాగరాజు గాడి తాత ఇల్లు, ప్రసాద్ గాడి ఇల్లు ఆజు బాజులోనే ఉంటాయి. అందులోను... ఈ ప్రసాద్ గాడు, నాగరాజు గాడి మీద గూడాచారి లెక్క. నాగరాజు గాడికి మామయ్యా ఒకడున్నాడు. ఆ మామయ్య వీడి దృష్టిలో కంసుడు. చిత్రహింసుడు. మేము ఏడో తరగతి చదువుతున్న సమయానికి ఆయన డిగ్రీ చివరి సంవత్సరమో? ఏమో? చదువుతున్నట్టు ఉండే. "నాగరాజు గాడిని క్రమశిక్షణ లో పెట్టాలి" అని అతను నాగరాజు గాడి పాలిట దెయ్యం లా తయారయ్యాడు. సరిగ్గా చదవడం లేదని, సరైన దారిలో లేవని, అదని ఇదని యమ కొట్టుడు కొట్టేవాడు. అలా తన్నులు తిని తిని వీడికి 'చదువంటే తన్నులే' అని మెదడు లో ముద్ర పడిపోయింది. భయం విపరీతంగా పెరిగిపోయింది.

"ఏ ఊరంటే మా ఊరంటా వెందిరా?" అని నర్సిమం సర్ నాగరాజు దగ్గరి కి వచ్చి కొద్దిగా వంగి తొడ పాశం పెట్టబోతుంటే ఈ లోకంలోకి వచ్చాను. ఆయన పెట్టనే పెట్టాడు పాశం. పాపం నాగరాజు గాడు బాధతో విలవిలలాడుతున్నాడు. అయితే వాడికి తాను చెప్పిన దాంట్లో ఉన్న తప్పేంటో అర్థం కావట్లేదు.

"వాడిది తోడేళ్ళ గూడెం సర్. ఖమ్మంలో వాళ్ళ తాతయ్య దగ్గర ఉండి చదువుకుంటున్నాడు" ఆ అమాయకుడి ఏడుపు చూడలేక తెలిసింది చెప్పాను.

"మానస వాళ్ళ తాతయ్య ఊరు కూడా తోడేళ్ళగూడెమే సర్" గుర్తొచ్చి చెప్పాను. ఈ సంగతి నాకు ప్రసాద్ గాడు చెప్పాడు. వాడికి నాగరాజు గాడు చెప్పి ఉంటాడు. ఆ అమ్మాయి వలన ఆ ఊరికి ఒక గుర్తింపు వచ్చింది అన్నట్టు చెప్పాను. అసలు అమ్మాయిలే పల్లెటూళ్ళకు పట్టు 'పరికిణీ' కొమ్మలని, అందమైన అమ్మాయిల పేర్లే పల్లెటూళ్ళ కు పెట్టాలని, ఆ విధంగా పెట్టడం వలన ఊరి ప్రతిష్ట పెరిగి అందరబ్బాయిలు తమ ఊరి జపమే చేస్తారని, ఊళ్లల్లోనే ఉంటారని, పల్లెల్లో సొంత ఇల్లు ఉన్నా... ఇలా సిటీలకు వచ్చి అద్దె ఇళ్ళల్లో ఉండాల్సిన అవసరం లేదని, అందుకని అమ్మాయిల పేర్లు పల్లెలకు పెట్టి, ఆ విధంగా కూడా అమ్మాయిలను గౌరవించుకోవచ్చని, అసలు మన స్కూల్ పేరు కూడా మార్చి ఒక అందమైన అమ్మాయి పేరు పెడితే అడ్మిషన్స్ బాగా పెరుగుతాయని, అమ్మాయి పేరు బదులు అందమైన టీచర్ పేరు కూడా పెట్టొచ్చని, కావాలంటే ఆ టీచర్ పేరు సూచించడం లో నా సహాయం ఉంటుందని... అదనీ, ఇదనీ ఇంకా

చాలా చెప్పాలనిపించింది. చదివేది ఏడవ తరగతి అయినా, చదువు గురించి కంటే అమ్మాయిల గురించి తెలుసుకోవడం అంటే భలే ఇంట్రెస్టు. అందుకేనేమో మమ్మల్ని ప్రసాద్ సర్ "ముదర ముండల్లారా!" అని తిడుతుంటాడు.

"చూసావా.... మీ తాతయ్య వాళ్ళ ఊరు నాకు తెలుసు" అన్నట్టు మొహం పెట్టి మానస వైపు చూసాను. మనసులో చెలరేగిన భావాలేమీ కనపకుండా ప్రయత్నం చేస్తూ. నేను చూడగానే "నా గురించి నీకెందుకు?" అన్నట్టు కోపంగా మొహం పెట్టి తల దించుకుంది మానస.

"అరేయ్ బుడం కాయ్... నిన్నెవరు అడిగార్రా ఈ వివరాలు అన్నీ?" నాగరాజు తొడ వదులుతూ అన్నాడు.

'అనవసరంగా గెలుకున్నానా?' మనసులో అనుకున్నాను.

"నన్ను బుడం కాయ్ అంటావేరా బోసిడికే. నువ్వు మాత్రం పెద్ద పొడుగున్నావా? బొడ్డు మేకుగా!" మనసులో అనుకున్నాను. నేను బొడ్డు మేకుతో పోల్చడం కాదు కానీ... ఆయన ఎత్తేమీ ఉండడు. కొద్దిగా లావు కూడా. మా ప్రిన్సిపాల్ ఉపేందర్ రెడ్డి సర్ పక్కన నిలబడితే ఆయన నడుం వరకు కూడా రాడు.

"మీ నాయన ఏం చేస్తాడు రా?" నన్ను అడిగాడు.

"సత్యం థియేటర్ లో టికెట్లు ఇస్తాడు సర్" ఏదో గవర్నమెంట్ నౌకరీ అన్నట్టు చెప్పాను.

"ఓరినీ... మీ నాన్న సినిమా హాల్లో టికెట్లు ఇస్తాడా?" కన్ఫర్మ్ కోసం ఇంకోసారి అడిగాడు. ఆయన మొహంలో కొద్దిగా ఆత్రం కనపడింది నాకు.

హమ్మా... ఈ సారు గాడు ఏదో గాడిలో పడేలా ఉన్నాడనిపించింది నాకు.

"అవును సర్. సత్యం థియోటర్లో బాల్కనీ టికెట్స్ ఇస్తాడు. మొన్నో సారి 'లిటిల్ సోల్జర్స్' సినిమాకి మన స్కూల్ విద్యార్థిని విద్యార్థులను తీసుకెళ్ళారు సర్" చేతులు కట్టుకుని చాలా వినయంగా మొహం పెట్టి, మొహంలో ఎక్కడ లేని అమాయకత్వాన్ని నింపుకుని చెప్పాను. ఈ దెబ్బకు ఈ కొత్త నాకొడుకు చిత్తయిపోవాలి అనుకున్నా.

"అవునా..?" ఆశ్చర్యపోతూ అడిగాడు.

"అవును సర్. అందరు వచ్చారు. భలే ఉంది సర్ సినిమా. భలే ఏడుపొచ్చింది. పిల్లలకు అమ్మా నాన్న ఉండాలి సర్ అసలు. లేకపోతే ఒంటరోల్లు, అనాధలు అవుతారు సర్. వాళ్ళ కష్టం పగోడికి కూడా రావొద్దు సర్" మొహానికి పట్టిన చెమటను అరచేతి తో తూడ్చుకున్నా. ఉపేందర్ రెడ్డి సర్ ఒకడు. క్లాస్ కి ఒక ఫ్యాన్ పెట్టియొచ్చుగా. "పెట్టియ్యి"మని అందామంటే.... "ముందు మీ నాన్న ను ఫీజు కట్టమను" అని అంటాడేమో అని భయం.

"అరేయ్ పిచ్చోడా...! సినిమా చూసి ఏడుస్తార్రా?" కొత్త సారు దగ్గరకు తీసుకున్నాడు.

చెమట పట్టి మొహం తుడుచుకుంటే 'ఏడుస్తున్నా' అనుకున్నాడా?... ఈయన మరీ అమాయకుడిలా ఉన్నాడే. ఎంతయినా మన యాక్టింగ్ స్కిల్స్ అలాంటివి. ఈయన్ని అనడం ఎందుకులే. అసలు ఈ చదువులు గిదువులు

కాకుండా సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్ లా చేరితే పోతుంది అనుకున్నాను. నా భుజం మీద చేయివేసి దగ్గరకు తీసుకున్న సారు ఇంకా వదల్లేదు.

"మా అమ్మ కూడా అదే అంటుంది సర్. ఇంత అమాయకుడివి ఎలా బ్రతుకుతావురా? అని" ఇంకా దీనంగా మొహం పెట్టాను. ఇక మనకు డోకా లేదు. బుట్టలో పడ్డట్టే ఈ అమాయకుడు. ఈయన క్లాస్ లో మనకిక తిరుగులేదు.

"అరేయ్ చిన్నా... కొత్త సినిమా వచ్చినప్పుడు నాకు ఫస్ట్ డే టికెట్ తెస్తావా?" అడిగాడు సారు.

"మీక్కాకపోతే ఇంక ఎవరికీ తెస్తాను సర్? స్కూల్ మొత్తాని సినిమాకి తీసుకుపోయినవాణ్ణి. మా డాడికి చెప్పి టికెట్స్ తెస్తాను సర్. నేను ఎంత చెప్తే అంత" 'డాడీ' అన్న పదాన్ని వత్తి పలుకుతూ అన్నాను. అసలైతే నేను 'నాన్న' అనే అంటాను. అప్పుడప్పుడు ఇలా ఇంగ్లిష్ వాడుతుండాలి. అప్పుడే మనల్ని స్కూల్ కి పంపిస్తున్నందుకు మన అమ్మా అయ్యా సంతోషిస్తారు. కష్టపడడానికి వాళ్ళకో మోటివేషన్. డాడీ అంటే రిచ్ ఫీలింగ్ తో పాటు, మా నాన్న ని 'డాడీ' అని పిలిచేంత క్లోజు అని ఫోజు కొట్టే ప్రయత్నం నాది.

"ఫ్రీగా ఏమీ తీసుకుపోలేదు సర్. టికెట్ డబ్బులు ఉపేందర్ రెడ్డి సర్ తీసుకున్నారు" పిల్లలమర్రి నరేంద్ర గాడు పితూరీ చెప్పాడు. వీడొకడు మధ్యలో పానకంలో మిరియం గాడు.

"టికెట్ లేకుండా ఎలా తీసుకుపోతాడు రా...?" అంటు నర్రి గాడికి తొడ పాశం పెట్టబోయాడు. కానీ... వాడిది కూడా కండలేని కాలే. "పోనియ్ లే" అని వదిలేసాడు.

"హమ్మయ్యా! ఈయన పూర్తిగా పడిపోయాడు" అనుకున్నా. సంతోషంతో పాటు కొద్దిగా భయం కూడా వేసింది. తీరా ఈయన అడిగినట్టు టికెట్ ఇవ్వకపోతే..???

అయినా నరేంద్ర గాడు అన్నది కూడా నిజమే. ఆరోజు సినిమా షోని టికెట్ పెట్టి వేసారు. నాన్న టికెట్స్ కట్ట తీసుకువచ్చి ప్రిన్సిపాల్ ఉపేందర్ రెడ్డి సర్ కి ఇచ్చారు. ఆయన "సినిమా పలానా రోజు ఉదయం వేస్తున్నాం. సినిమా చూడాలి అనుకున్న వాళ్ళు ఐదు రూపాయలు తీసుకురండి" అన్నారు. కొందరు టికెట్ కొన్నారు. కొందరు కొనలేదు. అయినా అందరిని మా నేతాజీ స్కూల్ ఉన్న బర్కాన్ పురం నుండి సత్యం థియోటర్ వరకు నడిపించుకుంటూ తీసుకెళ్ళారు. టికెట్స్ అమ్మగా వచ్చిన డబ్బులు నా స్కూల్ ఫీజ్ కింద ప్రిన్సిపాల్ సర్ జమ కట్టుకున్నారు. అందులో ఆయన తప్పు కూడా లేదు. ఎందుకంటే... నాతో పాటు, అదే స్కూల్ ల్లో చదువుతున్న మా ఇద్దరు చెల్లెళ్ళ ఫీజ్ ను కూడా ఏనాడు సరిగ్గా కట్టిన పాపాన పోలేదు. అడగగా అడగగా ఉన్నప్పుడు అంతో ఇంతో కట్టడం తప్ప, ఉన్నంత ఫీజ్ ఏనాడు కట్టిన చరిత్ర లేదు మా నాన్నకు. అందుకే ఖాతాలో కలిపేసుకున్నారు.

ఆరోజు క్లాస్ అలా అయిపోయింది. అయితే ఈ సినిమా టికెట్ కథ ఇంకా అయిపోలేదు.

ఈ సంఘటన జరిగిన కొన్నిరోజుల తరువాత...

"అరేయ్... మీ నాన్న సత్యం థియోటర్ లో కదా చేసేది" అన్నాడు నరసింహా రావు సర్

"అవును సర్ టికెట్లు ఇస్తాడు" అన్నాను చేతులు కట్టుకుని అతివినయంగా.

చాక్లెట్ కోసం పిల్లాడు మొహంలా పెట్టాడు మా సైన్సోడు. మొహం చాలా దీనంగా పెట్టి "అరేయ్ చిన్నా... మా మెగాస్టారు 'మాస్టర్' సినిమా రేపు రిలీజ్ ఉంది రా. వినోద థియోటర్ తో పాటు మీ నాన్న పని చేస్తున్న... అదే టికెట్లు ఇస్తున్న సత్యం థియోటర్ లో కూడా రిలీజ్ అవుతుంది రా చిన్నా...! ఎలా అయినా ఒక టికెట్ కావాలి. ప్లీజ్ రా..." అన్నాడు.

"అవునా...?" కట్టుకున్న చేతులు వదిలేసి ఒక చెయ్యి జోబులో పెట్టుకున్నా. ఆ జేబు ఒకసారి చిరిగితే అమ్మ కుట్టడం వలన చెయ్యి పట్టే లోతున్న జేబు కాస్తా, పూడుకుపోయిన బాయిలా అయ్యింది. సగం చెయ్యి బయటనే ఉంది. అలా చెయ్యి సగం లోపల, సగం బయట ఉండటం మన క్లాస్ మెట్ అనురాధ చూస్తుందా? చూసి ఏమైనా అనుకుంటుందేమో? అని సంశయం లో ఉండగా...

"నువ్వు ఏమైనా చెయ్యి రా. నాకు మాత్రం టికెట్ కావాల్సిందే. ఏం చేస్తావో నీ ఇష్టం. క్రితం సారి నాకు మాట ఇచ్చావ్ కూడా..." అన్నారు. హోం వర్క్ రాయకపోతే, ప్రసాద్ సర్ కొడుతుంటే "ప్లీజ్ సర్.. ప్లీజ్ సర్..." అంటూ చెరుకూరి పవన్ గాడు అలానే మొహం పెడతాడు.  ఆయన మొహంలో పవన్ గాడి మొహం గుర్తొచ్చి నవ్వొచ్చింది. నవ్వితే ఆయనకు కోపం వస్తుందని భయం వేసింది. అలానే చూస్తుంటే చివరాకరికి జాలి వేసింది.

"అరె... ఇందులో ఏముంది సర్? మీకు ఒక టికెట్ కావాలి అంతే కదా! నేను మా డాడీని అడిగి తీసుకొస్తా. రేపు మీరు మెగాస్టార్ సినిమా..... ఏంటది?"

"మాస్టర్..." ఆయన అందించాడు

"ఆ అదే.. మాస్టర్ సినిమా చూస్తున్నారు. మా మాస్టర్ కోసం ఆ మాస్టర్ టికెట్ తెస్తా సరేనా!"  టికెట్ నా జేబులోనే ఉందన్న ధీమాతో ఆయనకు చెప్పాను.

"అరేయ్ నువ్ మాట ఇచ్చావ్! ఒకవేళ టికెట్ తేలేదనుకో..." అని మాట ఆపు చేసాడు. ఆయన చూపు నా తోడ మీద ఆగిపోవడం తో నా గుండె ఆగినంత పనయ్యింది. ఈయన టికెట్ పని అవుతుందా? కాదా? అని మొదటిసారి భయం వేసింది.

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

మా నాన్న సెకండ్ షో టికెట్లు ఇచ్చి, ఆ షో పడ్డ తరువాత ఇంటర్వెల్ వరకు ఉండి ఇంటికి ఏ అర్ధరాత్రో వచ్చేవాడు. అప్పటికి మేము నలుగురం పిల్లలం, అమ్మ నిద్రపోయేవాళ్ళం. ఉదయం స్కూల్ కి తయారయి వెళ్ళే టైంకి

కూడా మా నాన్న లేచే వాడు కాదు. మేము స్కూల్ కి వెళ్ళాక లేచేవాడు. నాన్నను చూసేది మధ్యాహ్నం లంచ్ పీరియడ్ లో ఇంటికి వెళ్ళినప్పుడే. ముప్పావు గంట టైంలో ఇంటికి వచ్చి అన్నం తిని మళ్ళీ కిలోమీటరు దూరమున్న స్కూల్ కి వెళ్ళే సరికి సరిపోయేది. ఇక 'డాడీ' తో మాట్లాడటం ఎక్కడ కుదిరేది? అన్నం తినే సమయానికి రేడియోలో "పాడి పంటలు" కార్యక్రమం వస్తుండేది. "అన్నా... అక్కా..." అంటూ వాళ్ళు మాట్లాడే మాటలు వింటుంటే, 'కారణం లేకుండా కొట్టే రామారావు సర్ తన్నులు తింటూ చదువుకోవడం కంటే' ఈ చదువులు మానేసి తెలివిగా వ్యవసాయం చేసుకుని పండించిన వడ్లు తింటే బాగుంటుందేమో అనిపించేది ఒక్కోసారి. అంత ఇంటరెస్ట్ గా చెప్పే వాళ్ళు ఆ పాడి పంటలు కార్యక్రమం.

ఆ మధ్యాహ్నం కూడా అన్నం తినేటప్పుడు నాన్న వైపే చూస్తున్నా. ఆయన మాతో మాట్లాడటం చాలా తక్కువ. మాకు ఏదైనా కావాలంటే అమ్మ ను అడగడమే. అమ్మే మా అవసరాలు అన్నీ చూసుకునేది. టికెట్ గురించి మొదట అమ్మనే అడగాల్సింది. కాల్ చేతులు కడుక్కుని అన్నం ప్లేట్ ముందు కూర్చునే సరికే నాన్న వచ్చాడు. అన్నం ప్లేట్ లో సొరకాయ పులుసు ఇంకొంచం పోసింది అమ్మ.

"అదేమన్నా చేపల పులుసా? అంతంత పోస్తావ్! బోడి సొరకాయపులుసు" అన్నాను. మా పెంకుటింటికి కి ప్రహరీ గోడలు ఉండవు. ఆ మాట కొస్తే మా ఇంటి గోడలు కూడా మట్టి గోడలే. ఇక ప్రహరీ గోడలకు దిక్కేది? వాటి బదులు మాబీర తో కట్టిన తడికెల మీద పాకిన సొర తీగలకు కాయలు కాస్తే, అమ్మ ఆ సొరకాయలతో పులుసు చేసింది. కొనకుండా వచ్చిన ఫ్రీ కాయలు కాబట్టి ఆ పులుసంటే చిన్నచూపు. అందుకే బోడి సొరకాయ పులుసు అన్నాను.

"మీ నాన్న చేపలు తెస్తే చేపల పులుసే చేసేదాన్ని. సొరకాయ పులుసన్నా చేసాను. నోరు మూసుకుని తిను" అంటూ నెత్తిన ఒక్కటి పీకింది అమ్మ. నెత్తికి తగిలిన దెబ్బకు కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. అయినా 'పులుసు పోయొద్దు' అన్నందుకు కొట్టాలా? అనుకున్నాను. నన్ను కొట్టిన దెబ్బకు మిగతా ముగ్గురు నోరు మూసుకుని తింటున్నారు. ఎప్పుడు అన్నం వదిలిపెట్టే చిన్న చెల్లెలు కూడా నోట్లోకి అన్నం కుక్కుకుంది.

నాన్న ప్లేట్ పక్కకు నెట్టి లుంగీ మీద పాంట్ వేసుకుని, లుంగీ పక్కన పడేసి షర్టు వేసుకున్నాడు. గోడకి ఆనించి ఉన్న స్టాండ్ లేని సైకిలు తీస్తుంటే 'ప్రకాష్ మామ' నాన్న ఫ్రెండ్ వచ్చాడు. అప్పుడప్పుడు ఆయన ఇంటికి వెళ్లి "నాన్న పంపించాడు" అంటే డబ్బులు ఇచ్చేవాడు మామ. అవి తీసుకువచ్చి నాన్నకు ఇచ్చేవాడిని. మరి ఈ సారి ప్రకాష్ మామ ఇంటికి వచ్చాడు. ఎందుకో?

"రేపు ఉదయం రా ప్రకాష్" అంటూ ఆయన సమాధానం కోసం ఎదురుచూడకుండా నాన్న సైకిల్ వేసుకుని బయటికి వెళ్ళిపోయాడు.

అయ్యో 'ఒక సినిమా టికెట్ మా సర్ కి కావాల'ని నాన్నను అడుగుదామనుకున్నా. అడిగే లోపే వెళ్ళిపోయాడే. నాన్న ప్లేట్ లో అన్నం అలానే ఉంది. అమ్మ నన్ను కొడితే నాన్నకు కోపం వచ్చినట్టుంది. మనం అంటే నాన్న కు ఇష్టమేనా!?

"చాలీ చాలని జీతం. ఒకరికి నలుగురు పిల్లలు. జీతం ఏనాడు చేతికిచ్చింది లేదు. అసలు ఆ జీతం ఎంతో? ఏంటో? తెలియదు. నాలుగు రూపాయల తుప్పకాయలు ఇచ్చి నలుగు పిల్లల్ని సాదమంటే నా వల్ల ఎక్కడ అవుతుంది?" అంటూ అమ్మ మాతో అంటుంది. తనలో తను అనుకుంటుంది. అమ్మ కళ్ళ వెంట నీళ్ళు కూడా వస్తున్నాయి.

అమ్మ ఏడుస్తుంటే నాకు కూడా కళ్ళల్లో నీళ్ళు ఎక్కువ అయ్యాయి. అమ్మ అనటం కాదు కానీ... నాన్న ఎప్పుడు ఇంతే! మేమేం చదువుతున్నాం, ఏం బట్టలు వేసుకుంటున్నాం, మాకు పెన్నులు కావాలా? పెన్సిళ్ళు కావాలా? నోట్స్ లు అసలు ఉన్నాయా? లేవా? అన్న విషయం ఆయనకు పట్టదు. మా విషయమే కాదు... ఇంట్లో సరుకులు ఉన్నాయా? లేవా? అన్న విషయం అవసరం లేదు. ఎప్పుడు రికామీగా ఉంటాడు. ఇప్పుడు కూడా ఇదే వరస. ఆయనకు 'నా లోకం నాది' అన్నట్టు ఉంటుంది. అమ్మ బాధపడ్డప్పుడల్లా నాకు జ్వరం తగిలినట్టు అనిపిస్తుంది.
ఈసారి అమ్మ బాధ కంటే నా బాధే నాకు ఎక్కువ అయ్యింది. బాధ కూడా కాదు. భయం. ఈ టికెట్ తీసుకురాక పోతే ఆ నర్సింహం సారు సింహం అయ్యి నా తొడ ఎక్కడ పీకుతాడో అనే భయం. ఈ గండం గట్టెక్కడం ఎలాగా? నాకేం అర్ధం కాలేదు.

'అరేయ్ పెద్దోడా...! మీ సర్ ఎవడైనా సినిమా టికెట్ కావాలని అడిగాడా? అడిగితే భయపడకుండా చెప్పు. ఎవరు అడగలేదా? పోనీ... అడిగినా అడగొచ్చు. ఇదిగో ఈ టికెట్ నీ జేబులో ఉంచుకో' అని నేను అడగక ముందే మా నాన్న ఆ చిరంజీవి సినిమా టికెట్ ఒకటి నా చేతిలో పెట్టొచ్చు కదా! ఈయన తరీకా ఏందో అర్ధం కాదు. 'రేపు నాకు పిల్లలు పుడితే సినిమా టికెట్ ఎప్పుడు పిల్లల జేబులో ఉంచాలి. ఎప్పుడు ఏ సారు అడుగుతాడో పాపం వాళ్లకు మాత్రం ఏం తెలుస్తుంది?' అని గట్టిగా మనసులో అనుకున్నాను.
రేపు నా పిల్లల సంగతి సరే! ఇప్పుడు నా సంగతి ఏంటో అర్థం కావడం లేదు. పెద్దగా సమయం కూడా లేదు. 'రేపే సినిమా రిలీజ్' అని మా సారు మరీ మరీ చెప్పాడు. అయినా ఈయన బడిలో పాఠాలు చెప్పకోకుండా సినిమాకి వెళ్ళడం ఏందో? ప్రతి రోజు స్కూల్ కి వస్తూ ఎప్పుడో ఏడాదికి ఒకసారి రాకపోతే 'సెలవు చీటీ తీసుకురా' అని, అది తీసుకువచ్చినా 'మీ నాన్నను తీసుకురా' అని భయపెట్టే ఉపేందర్ రెడ్డి సర్ ఈ కొత్తోడికి సెలవు ఎలా ఇస్తున్నాడో అర్ధం కావడం లేదు. అందులో సినిమా చూడడానికి! 'టీచర్ల కో న్యాయం. పిల్లలకో న్యాయమా?' ఈసారి ప్రిన్సిపాల్ సర్ ని అడగాలి. ఇప్పుడొద్దులే. పెద్దయ్యాక అడగాలి. ఇప్పుడే అడిగితే కొట్టినా కొడతాడు ఆయన.
"రేపు నీకు సెలవు ఇవ్వను. ఖచ్చితం గా స్కూల్ కి రావాల్సిందే!" అని ప్రిన్సిపాల్ ఉపేందర్ రెడ్డి సర్ సైన్స్ వాడితో అంటే బాగుండును. "రేపు గనక నా మాట కాదని స్కూల్ మానేస్తే నిన్ను టీచర్ ఉద్యోగం నుండి తీసేస్తా. నీ దిక్కున్న చోట చెప్పుకో" అని కూడా అంటే ఇంకెంత బాగుంటుందో! అయినా ప్రిన్సిపాల్ విద్యార్థులతో సున్నితం గా ఉండి, టీచర్లతో కటినంగా ఉండాలి. అప్పుడే దేశ ప్రగతి. పిల్లల్ని భయపెడితే, కొడితే కాదు.

★★★★★★★★★★★★★★★★★★

ఆ రాత్రి అన్నం కూడా సరిగ్గా తినలేదు. మాకు పూటకో కూర ఉండదు. మూడు పూటలు ఒకటే కూర. కాబట్టి రాత్రి కూడా సొరకాయ పులుసే. అన్నం తినకపోవడానికి అదే కారణం కాదు. టికెట్ రేపు ఎలా ఇవ్వాలా? అనే ఆలోచనే ఆకలిని చంపేసింది. రాత్రి నిద్ర కూడా పోలేదు. టికెట్ ఇవ్వకుంటే తొడ పాశం పెడతాడు. అదైతే కరారే. కానీ క్లాస్ లో అందరి ముందు... అదీ అమ్మాయిల ముందు.., అదీ మన వైపు చూసి నవ్వే ఒకరిద్దరు అమ్మాయిలు ముందు 'నువ్వు మాట తప్పావు' అని అంటే చాలదా? అలా అన్న తరువాత తొడ పాశం కూడా పెడితే... తల తీసినంత పని కాదా!? అది నా భయం. వాళ్ళ ముందు ఈ సినిమా టికెట్ పిచ్చోడు నన్ను బద్నాం చేస్తే నేను తట్టుకోగలనా? ఒక ఏడవ తరగతి విద్యార్ధి ఏదయినా తట్టుకోగలడు కానీ... ఏడవ తరగతి విద్యార్ధినిల ముందు తన్నులు తినడం అస్సలు తట్టుకోలేడు. ఈ నిజం ఈ సమాజానికి ఎప్పుడు అర్ధం అవుతుందో నాకర్ధం కాదు!

ఇలా ఆలోచనలతో మాగన్ను గా ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు. అన్నీ పాడు కలలు. అందులో ఒకటి మాత్రం నన్ను బాగా భయపెట్టింది. లేచి తొడ చూసుకున్నా కూడా.

★★★★★★★★★★★★★★★

ఉదయం నిద్ర లేచాను. నాకంటే ముందు అమ్మ ఒక్కతే నిద్రలేచినట్టు ఉంది. కనపడలేదు. గడప గుండా చూస్తే పేడ నీళ్ళతో కళాపి చల్లుతుంది. మిగతా ఎవ్వరు నిద్ర లేవలేదు. ఎక్కడో కోడి కూసింది. దానికి కూడా రాత్రి నిద్రపట్టనట్టు ఉంది. గోడ మీద బల్లి ఒకటి సీతాకోకచిలుక ను లటుక్కున నోటకరుచుకుని గుటుక్కున మింగింది. రెప్పలు పటపట కొట్టుకుని ఆ సీతాకోక చిలుక పొద్దు పొద్దున్నే బల్లి కి ఆహారం అయ్యింది. నాకెందుకో భయం వేసింది. ఐదో తరగతి చదివే మా పెద్ద చెల్లె, మూడవ తరగతి చదివే మా చిన్న చెల్లె, ఒకటో తరగతి చదువుతున్న అందరికంటే చిన్న వాడు తమ్ముడు హాయిగా నిద్రపోతున్నారు. ఏడవ తరగతి చదివే నేను మాత్రం నిద్రపట్టక లేచాను. ఏడవ తరగతి అంటే కామన్ ఎక్సామ్స్ మాత్రమే కాదు. ఇలాంటి 'సినిమా టికెట్ కష్టాలు' కూడా ఉంటాయని చాలామంది కి తెలియదు. అందుకే అసలెవరు ఏడవ తరగతి చదవకూడదు. ఒక్క ఏడవ తరగతే కాదు. ఎనిమిది, తొమ్మిది, పది... ఏ తరగతి కూడా చదవకూడదు. దీనమ్మ ఏ చదువు వద్దు. గొడ్లు కాసుకుంటే మంచిది. అక్కడ టీచర్ గీచర్ ఎవరు ఉండరు. సినిమా టికెట్ కావాలని ఎవరు అడగరు.

కళాపి చల్లి, కాల్ చేతులు కడుక్కుని అమ్మ ఇంట్లోకి వచ్చింది. నేను దుప్పటి పక్కకు నెట్టి అమ్మ వైపే చూస్తున్నాను. పాల అతను సైకిల్ స్టాండ్ వేస్తున్న చప్పుడు వినపడింది. అమ్మ గుమ్మం వైపు ఒకసారి చూసి పాల అతనే

అని నిర్ధారణ చేసుకుని గోడకున్న సీలకి తగిలించిన నాన్న పాంట్ జేబులో చేయిపెట్టి చూసింది. నలిగిపోయిన యాభై రూపాయల నోట్లు రెండు ఉన్నాయి. వాటిని తీసింది. తీస్తుంటే... ఏదో కాగితం కింద పడింది. అమ్మ దానిని గమనించలేదు. నేను చూసాను

నలిగిన ఆ రెండు యాభై రూపాయల నోట్ల తో పాటు పాల గిన్నె తీసుకుని అమ్మ బయటికి వెళ్ళింది. . పడుకున్న వాడిని దిగ్గున లేచి కూర్చున్నాను. ఎందుకో తెలియదు అది 'సినిమా టికెట్ ఏమో?' అన్న అనుమానం వచ్చింది. నేను గది మొత్తం ఒకసారి చూసాను. అందరు నిద్రపోతున్నారు. నాన్న కు అసలు సోయే లేదు. ఇందాక సీతాకోక చిలుకను మింగె బల్లిలా మెల్లగా నాన్న ప్యాంటు కింద పడిన కాగితాన్ని చప్పుడు కాకుండా చేతిలోకి తీసుకున్నాను. దాన్ని పరీక్షల్లో క్వశ్చన్ పేపర్ ను చూసిననట్టు జాగ్రత్తగ్గా చూసాను. సినిమా పేరు రాసి ఆరోజు డేట్ వేసి, బాల్కనీ టికెట్ ఉంది. నేను కావాలనుకుంటున్న టికెట్ అదే అని అర్థం అవ్వగానే "ఎదవల్లారా! ఇలాగే చదివితే శిరీష, భార్గవ్, శ్వేత, పురుషోత్తం... తప్పించి మీ అందరు ఫెయిల్ అయ్యి ఇంట్లో కూర్చుంటారు" అని భయపెట్టే తెలుగు ఆరుద్ర టీచర్ ముందు, పాస్ అయ్యి అందరి కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకుని కాలర్ ఎగరేసినట్టు అనిపించింది.

టికెట్ జేబులో పెట్టుకున్నాను. గోడకు ఆనించి ఉన్న నాన్న సైకిల్ తీస్తుంటే... "యాడికి రా?" అంది అమ్మ పాల గిన్నతో ఇంట్లోకి వస్తూ.

"నిన్న నా సైన్స్ నోట్సు ప్రదీప్ గాడి బాగ్ లో కల్సింది. అది తెచ్చుకోవడానికి వెళ్తున్నా. అసలే ఈరోజు సైన్స్ స్లిప్ టెస్ట్" అబద్ధం చెప్పాను. ఇక అమ్మకు ఏ అవకాశం ఇవ్వలేదు. సైకిల్ కాంచి ఎక్కి తొక్కడం మొదలు పెట్టాను.

"అరేయ్ జాగ్రత్త! అటు ఇటు చూసి తొక్కు. సీట్ ఎక్కి తొక్కకు. కాళ్ళు అందక కింద పడతావ్!" అమ్మ వెనక నుండి అరుస్తుంది. మొన్నొకసారి అలా సీట్ తోక్కబోయి కిందపడితే మోచేతి కింద పెద్ద దెబ్బే తగిలింది.

"నీయమ్మ. నాన్న నువ్వే దీనంతటికీ కారణం. మీ ఇద్దరు పొట్టిగా ఉండటం వల్లనే కదా నేను పొట్టిగా ఉన్నాను. బత్తుల అరుణ్ గాడు నాలా సెవెంత్ క్లాసే చదువుతున్నా... వాడు చూడు హాయిగా సీట్ ఎక్కి సైకిల్ తొక్కగలిగే అంత ఎత్తు ఉన్నాడు. కాళ్ళు అందుతాయి. వాడొక్కడికే కాదు. నవీన్ గాడికి, సమతకి, నిర్మలకి, సౌజన్యకి, స్వర్ణలతకి... ఇలా చెప్పుకుంటూ పోతే చాలా మందే ఉన్నారు. వాళ్ళందరికీ కాళ్ళు అందుతాయి. నాలా కాంచీ తొక్కాల్సిన అవసరం లేదు. పొట్టి వాణ్ని అన్న ఫీలింగ్ రాకుండా ఉండాలని అప్పుడప్పుడు సీట్ ఎక్కి తొక్కే ప్రయత్నం చేస్తుంటే చూసి మేచ్చుకోవాల్సింది పోయి, 'తోక్కొద్దు అని తొక్కేస్తావా? నీయమ్మ' అని గరం అయ్యాను.

'ఈ టికెట్ అయితే ముందు ఆ పిచ్చోనికి ఇచ్చి రానీ... తరువాత నీ సంగతి చెప్తా. నిన్న అన్నం తినేటప్పుడు కూడా కొట్టావ్ కదా!" అనుకుంటూ సైకిల్ తొక్కుకుంటూ నరసింహారావు సర్ ఇంటి వైపు వెళ్ళాను. ఆ అడ్రెస్ మొన్న ఆయనే మాటల సందర్భం లో చెప్పాడు. ఆయన చెప్పినట్టు ఇరవై నాల్లుగంటల పంపు ఎదురుగా ఉన్న ఇంటి గేటు తెరిచాను.

వరండాలో లుంగీ కట్టుకుని పైన బనీయన్ మీదతో పేపర్ చదువుతున్న ఒకాయన కనిపించాడు. పేపర్ అడ్డు రావడం వలన ఆయన మొహం కనపడటం లేదు.

"సార్..." అన్నాను. అసలు ఈ ఇల్లేనా? ఎవరో ఏంటో? అని. ఇల్లు ఇదే అయినా... నర్సింహం సార్ ఈయన కాదేమో అనిపించింది. ఎందుకంటే ఆయన అయితే సినిమా టికెట్ కోసం నిద్రపట్టక, నేను టికెట్ తెస్తానేమో అని మాటి మాటికి గుమ్మం వైపు చూస్తూ ఉండాలి కదా! నేను రావడం లేట్ అయితే ఆయన సైకిల్ వేసుకుని సరాసరి మా ఇంటికి రావాలి కదా! మరి ఈయనేమో తీరిగ్గా పేపర్ చదువుకుంటున్నాడు. ఈయన కాదేమోనని అందుకే అనిపించింది.

"ఎవరు" అంటూ నా వైపు చూసాడు.

ఆయన నరసింహా రావు సారే.

"ఏంట్రా? ఇలా వచ్చావు?" అన్నాడు

ఓరిని నువ్వేం సారువు రా నాయనా? నీవల్ల నాకిదేం సావురా నాయనా? మమ్మల్ని తిడతావు కానీ... అసలు నీకు బుద్ధి జ్ఞానం ఉందా? "సినిమా టికెట్ కావాలి? తేకపోతే బాగోదు." అని నన్ను బెదరగొట్టావు. నీ భయానికే కదా నేను దొంగలా మారింది. ఇప్పుడేమో తీరిగ్గా "ఏంట్రా ఇలా వచ్చావు? అంటావా?"

"అదే సర్ ఈరోజు సినిమా టికెట్ కావాలి అన్నారు కదా" మెల్లమెల్లగా గునిగాను.

"హా... తెచ్చావా?" ఒక్కసారే మొఖం మారిపోయింది ఆయనది.

సైకిల్ ఎగిరెగిరి తొక్కడం వలన మొహానికి పట్టిన చెమట చేత్తో తుడుచుకుని... "తెచ్చాను సర్. నిజానికి డాడికి నిన్నే చెప్పాను సర్. మా సైన్స్ సర్ కి టికెట్ కావాలి. ఏం చేస్తారో డాడిగారు నాకైతే టికెట్ తీసుకురండి అన్నాను సర్" చేతులు కట్టుకుని దీర్ఘం తీస్తూ అంటూ మాటలు ఆపాను. ఆపి ఒకసారి ఆ సైన్సోడి మొహం చూసాను. లుంగీ కిందకు జార్చాడు. మిటాయి తింటున్నోడిలా మొహం పెట్టాడు.

"మా సైన్స్ సర్ మెగాస్టార్ ఫాన్ అంట. నేనేమో మా సైన్స్ సర్ ఫాను. కాబట్టి నాకు టికెట్ కావాల్సిందే డాడీ అని కూడా అన్నాను సర్" ఈసారి కట్టుకున్న చేతులు వదిలేసాను. అయితే అలా చేతుల్ని గాలికి వదిలేయడం ఇబ్బందిగా అనిపించింది. జేబులో పెట్టుకుందామా అనుకున్నా కానీ... జేబులో టికెట్ నలుగుతుందేమో? అని ఆ ప్రయత్నం చేయలేదు.

"నాకు తెలుసు నాన్న నువ్ టికెట్ తెస్తావని" నా చేతులవైపు చూసాడు సారు. టికెట్ చేతుల్లో ఉందని.

"తేకుండా ఉంటానా సర్. ఇదిగోండి" అని జేబులోనుండి అతి జాగ్రత్తగా ప్రోగ్రెస్ కార్డ్ ను తీసినట్టు తీశాను.

ఆబగా దాన్ని తీసుకుని ఒకసారి ఆ టికెట్ ని పరిశీలించి "ఓహో మార్నింగ్ షో ది. థాంక్స్ రా" అన్నాడు.

"అయ్యో మీరు థాంక్స్ చెప్పడం ఏంటి సర్. డాడికి తెలిస్తే కోప్పడతారు. టికెట్ మీకు ఇచ్చినందుకు కాదు. మీరు నాకు థాంక్స్ చెప్పినందుకు" అన్నాను.

"గుడ్ స్టూడెంట్" అని నవ్వాడు సారు.

★★★★★★★★★★★★★★★★★★★★★★★

కోడిరెక్క హరిప్రియ ఇంటి మీదుగా మా ఇంటికి వచ్చాను. కోడిరెక్క ఆమె ఇంటిపేరు. ఆ పేరు పెట్టి హరిప్రియ ను ఏడిపిస్తుంటాను. హరిప్రియ రైటింగ్ గుండ్రం గా ఉంటుంది. ఒకసారి ఆ అమ్మాయి కనపడితే బాగుండు అనుకున్నాను.

"ఏంటి ఇలా వచ్చావు?" అనడిగితే...

"నేను టికెట్ ఇస్తే సర్ సినిమాకు వెళ్ళాడు" చెప్పాలి అనుకున్నా. కానీ... ఆ అమ్మాయి ఇంకా లేచినట్టు లేదు. 'ఈ ఆడ పోరగాళ్ళకు అసలు భయం లేదు. తొందరగా లేవాలని, ఇవరం సవరం ఉండాలనే విషయమే తెలియదు. ఛీ.. ఛీ...' అనుకున్నాను. సర్లే ఇప్పటికి మునిగిపోయింది ఏముంది? స్కూల్ కి వచ్చాక చెప్పొచ్చులే అనుకుంటూ గాల్లో తేలుతూ ఇంటికి వచ్చాను.

సైకిల్ గోడకు ఆనించాను.

ప్రకాష్ మామ కుర్చీలో కూర్చున్నాడు. నాన్న మెట్టు మీద కూర్చున్నాడు.

ఏదో మాట్లాడుకుంటున్నారు.

"అల్లుడు పొద్దు పొద్దునే ఎక్కడికో పోయి వస్తున్నవు" అన్నాడు ప్రకాష్ మామ.

"నోట్స్ తెచ్చుకోవడానికి వెళ్ళాను మామ" అన్నాను.

"నోట్స్ తెచ్చుకోవడానికి వెళ్ళావా? మరి నోట్స్ ఏదిరా" నాన్న అడిగాడు.

'అబ్బా... నిజమే కదా' అనుకున్నా. అబద్ధం చెప్పడం అంత వీజీ కాదు అని కూడా అనుకున్నాను.

"దారిలో మా క్లాస్మేట్ హరిప్రియ అడిగితే ఇచ్చాను" కవరింగ్ కోసం చెప్పాను.

"నీకే రాదు. ఆ అమ్మాయికి ఎలా ఇచ్చావ్ రా. నీకంటే చదువు రానోళ్ళు కూడా ఉన్నారా" మా నాన్న అన్నాడు.

"నేను స్కూల్ ల్లో థర్డ్ ర్యాంక్" అన్నాను. మనం ఏం చెప్పినా నాన్నకు తెలియదులే అని.

"బావా... నా అల్లుడు మామూలోడు కాదు. మీ కష్టాలన్నీ పోగొడతాడు పో..." అన్నాడు

నాకు ఈడయ్యే పిల్ల ప్రకాష్ మామకు లేదు. లేకుంటే ఇంత మంచి వాడి పిల్లను చేసుకుని అప్పటికప్పుడు ఉద్ధరిద్దాం అనుకున్నా.

నేను లోనికి వెళ్ళా.

అమ్మ స్నానం చేయమంది. బాత్రుంకి వెళ్లి వచ్చే సరికి నాన్న అమ్మను తిడుతున్నాడు.

అమ్మ కూర వండుతూ నాన్నను అదే రీతిన తిడుతుంది.

'ఎంటా?' సంగతి అనుకుంటే...

"నిన్న రాత్రి రెండు యాభై నోట్లు, ఒక బాల్కనీ టికెట్ తీసుకువచ్చాను. నాకు బాగా గుర్తుంది."

"నాకు నీ టికెట్ గొడవ తెలియదు. జేబులో వంద రూపాయలు ఉంటే... పాలవాడికి ఇచ్చాను. నాకు అంత వరకే తెలుసు" అమ్మ అంతే గట్టిగా చెప్తుంది.

నా గుండెల రాయి పడింది.

నాన్న దుమదుమలాడుతూ బయటికి వచ్చాడు.

"ప్రకాషు నువ్ డైరెక్ట్ గా థియేటర్ కి వచ్చేయ్. ఆ టికెట్టు, సీట్ నెంబరు నాకు గుర్తే. వెళ్లి డైరెక్ట్ గా కూర్చుందువు" మామ తో నాన్న అంటున్నాడు. అంటే ఆ టికెట్ ప్రకాష్ మామ కోసం నాన్న తెచ్చాడన్న మాట. దాన్ని నేను సార్ కి ఇచ్చానా?

ఈసారి నిజం గానే దడుసుకున్నా. ఆ టికెట్ లో సర్ కూర్చుంటే ఆయన దగ్గరకు నాన్న వెళ్లి, "ఈ టికెట్ ఎక్కడిది అంటే..." నేను చేసిన దొంగతనం తెలిసిపోతుంది. ఆయన వచ్చి స్కూల్ ల్లో అందరి ముందు నేను చేసిన పని చెప్తాడు. అప్పుడు అందరు నన్ను దొంగలా చూస్తారు. నవ్వుతారు. అప్పటి వరకు భలే ఖుషీ గా ఉన్న నేను 'ఎండలో మోకాళ్ళు వేస్తున్న స్టూడెంట్' లా వాడిపోయాను.

★★★★★★★★★★★★★★★★★★★★

క్లాస్ లో కూర్చున్నా అన్న మాటే కానీ... నా గుండె బితుకు బితుకుమంటూనే ఉంది. ఎప్పుడేం జరుగుతుందో అర్థం కావడం లేదు. ఉదయం పూట రెండోది సైన్స్ పీరియడ్. ఆ టైం లో ఇంగ్లీష్ శాంతా కుమారి టీచర్ వచ్చారు. అంటే సైన్స్ సారు సినిమాకు వెళ్లాడన్న మాట.

నాన్న ఆయన్ని మధ్యలో లేపి బయటికి నెట్టాడా? 'మీ కొడుకే నాకు టికెట్ ఇచ్చాడు' ఆయన చెప్పాడా? ప్రకాష్ మామ అప్పుడు అక్కడే ఉన్నాడా? ఉంటే "నీకొడుకు పెద్ద దొంగ నా కొడుకు'' అని ఆయన అనుకున్నాడా? వాళ్ళు అనుకోవడం సరే.... ఇంటికి వచ్చాక నాన్న నన్ను ఎలా కొడతాడో? అని భయం వేసింది.

అటు నాన్న దగ్గర తన్నులు తినడం, ఇటు ఈ సారుతో తొడ పాశం తినడం ఖాయం అనుకున్నాను. ఇప్పటికిప్పుడు మాయం అయిపోతే బాగుండు అని కూడా అనుకున్నాను.

ఈ సినిమా ఏదో నా ప్రాణానికే వచ్చింది అనుకున్నాను.

మధ్యాహ్నం లంచ్ బెల్లు కు ఇంటికి వెళ్ళలేదు. ఇద్దరు చెల్లెళ్ళను పోయి తిని రమ్మన్నాను.

క్యారేజ్ తెచ్చుకున్న వాళ్ళు అన్నం బాక్స్ లు తెరిచి తింటున్నారు. కూరల గుమగుమల వాసన ఆకలిని పెంచింది. కరువున పడ్డసంత లా ఒకొక్కళ్ళు యమ తిండి తింటున్నారు.

"ఎందబ్బాయ్ నువ్వు క్యారేజీ తెచ్చుకోలేదా?" అడిగింది నా క్లాస్మేట్ సఫియా.

"ఈరోజు నేను ఉపాసం" అన్నాను.

సఫియా కు నేను చెప్పింది అర్ధం కాలేదు అనుకుంటా.

"ఇదిగో కొద్దిగా తిను" అంటూ క్యారేజీ బాక్స్ మూతలో కొంత అన్నం పెట్టి ఇవ్వబోయింది.

"ఉపవాసం అంటే ఏమీ తినడని అర్ధం. లేకపోతే ఇంటికి పోయేవాడు కదా అన్నం తినడానికి" కిరణ్మయి అంది.

'ఓసి నీ దుంప తెగ. పిల్లి లా ఉండి నేను అన్న మాటలు ఎక్కడ నుండి విన్నావు?' అనుకున్నాను.

"అవును సఫియా. ఈరోజు ఉపవాసం. అన్నం తినకూడదు. అసలే సెవెంత్ కామన్ ఎగ్జామ్స్ కదా! ఉపవాసం చేయమని అమ్మ చెప్పింది" అని సఫియా కు చెప్పాను. శ్వేత వైపు తిరిగి "ఇదిగో కిరణ్మయి... నువ్వు కూడా అంతలా తినకు. అప్పుడప్పుడు దేవుడి కోసం ఉపవాసం చెయ్యి. లేకపోతే ఫెయిల్ అవుతావు" కసిగా చెప్పాను.

"నేను అవన్నీ నమ్మను లే" పెరుగన్నం లో పప్పు నంజుకుంటూ చెప్పిందా ప్రభువు బిడ్డ.

★★★★★★★★★★★★★

సాయంత్రం స్కూల్ వదిలేశాక చెల్లెళ్ళతో ఇంటికి నడుస్తున్నాను. ఆకలి వల్ల అనుకుంటా నీరసం గా ఉంది.

"అన్నా... మధ్యాహ్నం అన్నం తినేటప్పుడు నిన్ను నాన్న అడిగాడు. అన్నానికి ఎందుకు రాలేదు? అన్నాడు" పెద్దచెల్లి చెప్పింది.

"ఇంకా ఏమైనా అన్నాడా?" భయం తో అడిగాను.

"ఆ.......అంతే!" అంది.

'అంటే నేను అనుకున్నట్టే జరిగిందా?' భయపడ్డాను

ఇంటికి వెళ్లి బాగ్ పక్కన పెట్టి నవారు మంచం మీద పడుకున్నా.

అంతే ఈ కథ అక్కడి వరకే గుర్తుంది నాకు.

★★★★★★★★★

సరిగ్గా పదకొండో రోజు జ్వరం తగ్గాక మనిషిని అయ్యాను.

అమ్మ చెప్తే కానీ మంచం మీద పడుకున్న తరువాత ఏమయ్యిందో గుర్తుకురాలేదు నాకు.

మంచం మీద పడుకున్న నేను అమ్మ ఎంత లేపినా లేవలేదట. ఒళ్ళు నిప్పుల కుంపటి లాగా కాలిపోయిందంట అప్పుడు. బస్ డిపో దగ్గర ఉన్న గాంధీ అనే ఆర్.యం.పి డాక్టర్ కు చూపిస్తే ఒక సూది వేసాడట. రాత్రి మొత్తం తడిగుడ్డతో ఒళ్ళంతా తుడవాలని ఆయన చెపితే అమ్మ అలానే చేసిందట. అయినా జ్వరం ఏ మాత్రం తగ్గలేదట. అమ్మ తెల్లారి వరకు చూసి, నాన్నను లేపి సైకిల్ మీద ఆరు గంటల సమయం లో కలక్టరేట్ ఎదురుగా ఉన్న పెద్దాసుపత్రి కి తీసుకువెళ్ళిందట.

నా పరిస్థితి చూసి వెంటనే అడ్మిట్ చేసుకున్నారట. అమ్మ వాళ్ళ నాన్న మురళి తాత కు కబురు పెడితే వచ్చాడట. తాత,అమ్మమ్మ ఖమ్మం లో నిజాంపేట లో ఉంటారు. అలా అమ్మ, మురళి తాత కలిసి నన్ను వారం రోజుల పాటు చూసుకున్నారట. అమ్మ పొద్దునే ఇంటికి వెళ్లి వంట చేసి చెల్లెళ్ళను తయారు చేసి స్కూల్ కి పంపేదట. వాళ్ళు స్కూల్ కి వెళ్ళగానే క్యారేజీ కట్టుకుని ఆసుపత్రికి వచ్చేదట. తమ్ముణ్ణి అమ్మమ్మ దగ్గర ఉంచిందట. అమ్మ రాగానే తాత ఇంటికి వెళ్లి సాయంత్రం వచ్చేవాడట. "అలా మీ అమ్మ నిన్ను కాపాడబట్టి బతికి బట్టకట్టావురా వారి" అన్నాడు తాతయ్య జ్వరం తగ్గాక.

"నాన్న ఏడి?" అడిగాను.

"ఈ నాకొడుకులు ఇంతే నాయనా! చాకిరీ చేసేది నేను. ప్రేమేమో తండ్రి మీద. చూసావా లేవగానే తండ్రి ని అడుగుతున్నాడు. ఒక్క నాడైనా పిలగాడి దగ్గర పడుకున్నాడా? ఆరోజు ఉదయం వీణ్ణి నన్ను హాస్పిటల్ దగ్గర దింపటమే కానీ ఏనాడైనా వీడికి ఎలా ఉందో? అని వచ్చి చూసాడా?" అమ్మ తాత తో అంది.

హాస్పిటల్ నుండి ఇంటికి వెళ్ళాను.

నాన్న నన్ను టికెట్ గురించి అడగలేదు. అసలే జ్వరాన పడి ఇప్పుడే బాగుపడ్డాడు. 'మళ్ళీ ఎందుకులే ఇవన్నీ' అనుకుని ఉంటాడు. అప్పుడే కాదు మళ్ళీ ఎప్పుడు అడగలేదు.

పూర్తిగా బాగయ్యాక స్కూల్ కి వెళ్ళాను.

అదేంటో పది రోజులకే స్కూల్ చాలా మారినట్టు అనిపించింది.

నేను రాకపోవడం ఎవడు గుర్తించనట్టు గా ఉంది. క్లాస్ లో కూడా 'ఏమైంది? ఎందుకు రాలేదు?' అని ఎవ్వరు అడగలేదు.

నేను ఎదురు చూస్తున్న సైన్స్ క్లాస్ రానే వచ్చింది. 'ఈయన ఏమంటాడో?' అనుకున్నాను. ఆయన పాటికి ఆయన 'కిరణజన్య సంయోగ క్రియ' అంటూ పాటం చెప్పుకుంటూ పోయాడు. బెల్లు కొట్టగానే వేరే క్లాస్ కి వెళ్ళిపోతూ నన్ను చూసాడు.

'అమ్మో... చూసాడు' అనుకున్నాను

'అరేయ్ నీకు జ్వరం వచ్చిందా? నీలాంటి మంచి స్టూడెంట్స్ కి ఇలాంటివి వస్తాయి. ఆరోగ్యం జాగ్రత్త రా" అంటూ వెళ్తున్నాడు. 'జ్వరం వచ్చిన విషయం ఎవరు చెప్పరా?' అనుకున్నా. చెల్లి వాళ్ళు చెప్పారేమో....!?

'ఈయనేంటి అసలు టికెట్ విషయం ఎత్తటం లేదు' అనుకున్నాను.

వెళ్తున్న వాడల్లా మళ్ళీ వెనక్కు వచ్చి... "అన్నట్టు ఆరోజు నువ్వు ఇంటికి వచ్చి మరీ టికెట్ ఇచ్చావు కానీ... నేను సినిమా కి వెళ్ళలేక పోయాను రా. ఉపేందర్ రెడ్డి సర్ డి.ఈ.ఓ ఆఫీస్ కు వెళ్తూ నన్ను కూడా తీసుకువెళ్ళారు. అందుకే సినిమా కి వెళ్ళలేక పోయాను. అనవసరంగా టికెట్ వేస్ట్ అయ్యింది" అంటూ వెళ్ళిపోయాడు

COMMENTS